క్లుప్తంగా

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా సుదర్శన్


సుదర్శన్

నడికూడ : మండలంలోని చౌటుపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పీఆర్టీయూ మండల శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా అచ్చ సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా కటుకోజ్వల సతీష్‌ను ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాయంపేట : 2024–25 విద్యా సంవత్సరానికిగాను మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదోతరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భూపాలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 సంవత్సరంలో నాల్గోతరగతి చదివి ఉండాలని, విద్యార్థులకు ప్రవేశ పరీక్ష అబ్జెక్టివ్ పద్ధతిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారని తెలిపారు. జనవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంట్రన్స్ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీన ఉంటుందని వెల్లడించారు.

ఉద్యోగ విరమణే.. ఉద్యమ విరమణ కాదు

విద్యారణ్యపురి: తాను ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విరమణ చేస్తున్నానే తప్ప ఉద్యమ విరమణ చేయడం లేదని ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సముద్రాల అనిత అన్నారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో 28 ఏళ్లుగా ఉపాధ్యాయురాలుగా పనిచేసిన ప్రముఖ సామాజిక కార్యకర్త, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు అనిత.. వలంటీర్ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ అభ్యసన ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆమె మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం ఆముదాలదాత మహర్షి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీటీఎఫ్ బాధ్యులు సమ్మిరెడ్డి, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు బూర సరళ, సుధాకర్, రమేష్, భాగ్యలక్ష్మి, రమాదేవి, సరస్వతి, దయాసాగర్, గోపికృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

కాజీపేట: హనుమకొండ పట్టణంలోని జులైవాడకు చెందిన సజ్జ భాస్కర్‌రావు (95) శనివారం మృతి చెందారు. కాగా, కుటుంబ సభ్యుల అంగీకారంతో మృతుడి నేత్రాలను దానం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న భాస్కర్ రావు మృతి చెందగా ఆయన కుమారులు రిటైర్డ్ డీఎస్పీ ఆంజనేయులు, కృష్ణ, కూతురు భారతి సమ్మతితో తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ సహకారంతో ఎల్వీ ప్రసాద్ కంటి సేకరణ నిపుణులు మృతుడి నేత్రాలను సేకరించారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

హసన్‌పర్తి: జాతీయ స్థాయి తంగ్ – తా మార్షల్ ఆర్ట్స్‌లో ఎంపికైన వంగపహాడ్ పాఠశాలకు చెందిన పి.హర్షిత, ఎస్.అక్షితకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి అందజేశారు. ఇటీవల నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జనవరి 11నుంచి 17వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వారిరువురు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. క్రీడాకారుల ప్రయాణంతో పాటు ఇతర ఖర్చులకు దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ కవితకు స్వాగతం

కాజీపేట రూరల్: భారత జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, నాయకులు కాజీపేట బాపూజీనగర్‌లో శనివారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, నాయకులు శ్రీకాంతాచారి, మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, జనార్దన్ గౌడ్, నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, శిరుమల్ల దశరథం, మర్యాల కృష్ణ, ఎండీ.అఫ్జల్‌పాషా, విజయ్ పాల్గొన్నారు.

మేం విధులు నిర్వహించలేం

హసన్‌పర్తి: క్షేత్రస్థాయిలోకి వెళ్లి విధులు నిర్వహించలేమని ఏఈ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు నీటి పారుదల శాఖ వరంగల్ సర్కిల్ ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందించారు. ఎస్సారెస్పీ భూముల కబ్జాపై చర్యలు ఉపక్రమించే క్రమంలో పలివేల్పులలో కొంతమంది అక్రమార్కులు శుక్రవారం చేసిన భౌతికదాడి యత్నంతో పాటు మొబైల్ ధ్వంసం చేసిన విషయాన్ని ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. ఐదారుగురు వ్యక్తులు తమ చొక్కా పట్టారని ఎస్‌ఈకు ఏఈ కిశోర్ వివరించారు. అన్నాసాగరం నుంచి ఆటోనగర్ వరకు వందలాది ఎకరాల భూముల్లో గుడిసెలు వెలిశాయని ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డికి ఏఈలు వివరించారు. భూములను కాపాడానికి వెళితే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు

- కేక్‌లు కట్ చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ప్రశాంతంగా జరుపుకోవాలని అధికారుల సూచన


పరకాల : విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ జోసఫ్

పరకాల: పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టెక్నో స్కూల్(బిట్స్)లో కొత్త సంవత్సరం వేడుకలను విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. 2023కు వీడ్కోలు పలుకుతూ 2024 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ జోసఫ్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు వేడుకలు

శాయంపేట : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కాట్రపల్లి గ్రామంలో సీఎస్ఐబీజేఎం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సాంజార్జ్, ప్రిన్సిపాల్ లిబియా, ఉపాధ్యాయులు అనిల్, అశోక్, రాజునాయక్, రాజన్న, రవీందర్, ప్రవళిక, శైలజ, మౌన్య, ఉమ పాల్గొన్నారు.


శాయంపేట : కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు


ఐనవోలు : కేక్ కట్ చేస్తున్న హెచ్‌ఎం

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ మల్లేష్ కోరారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీన రాత్రి 12.30 గంటల వరకు వేడుకలకు అనుమతి ఉందన్నారు. యువకులు మద్యం సేవించి రోడ్లపై వేడుకలు నిర్వహించొద్దని హెచ్చరించారు. మద్యం మత్తులో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. మండలంలో నాలుగు పోలీస్ బృందాల ద్వారా డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించినట్లు హెచ్‌ఎం చుంచుకాల లింగారావు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి, బెలూన్‌లతో అలంకరించి ఆనందోత్సవాల మధ్య వేడుకలు నిర్వహించామన్నారు. నూతన సంవత్సరంలో విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యంతో ముందుకెళ్లాలని కోరారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను సామూహికంగా అధిగమించాలి


అవగాహన కల్పిస్తున్న విశ్వవిద్యాలయ విద్యార్థి

ఐనవోలు : మండలంలో నెలకొన్న వనరుల కొరత, నీటి సమస్య, మురుగు నీరు, వ్యవసాయ కూలీల కొరత వంటి సమస్యలను రైతులందరూ కలిసి అధిగమించాలని మల్లారెడ్డి విశ్వవిద్యాలయ విద్యార్థులు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణపొందుతున్న విద్యార్థులు శనివారం మండలంలోని సింగారం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. కాగా వీరు గ్రామంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక తులనం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ నక్ష, వనరుల పటం, సమస్యల చెట్టు, కాలక్రమం పటం వంటి పటాలను నేలపైన ఆకర్షణీయంగా చిత్రించి గ్రామంలోని రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో వనరుల కొరత, నీటి సమస్య, మురుగు నీరు, వ్యవసాయ కూలీల కొరత వంటి సమస్యలు ఉన్నాయని రైతులకు వివరించారు. ఈ సమస్యలన్నింటినీ రైతులందరు కలిసి సామూహికంగా అధిగమించాలని సూచించారు. ఈ అవగాహన సదస్సుకు కేవీకే శాస్త్రవేత్తల బృందం, రైతు కమిటీ అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతులు తదితరులు హాజరయ్యారు.

ఎంపీ సీటు మహిళకు కేటాయించాలి


మాట్లాడుతున్న ప్రతాపగిరి విజయ్‌కుమార్

పరకాల : మహిళా బిల్లుకు కేంద్రం ఆమోదం తెలిపినందున 34 శాతం రిజర్వేషన్‌ల్లో వరంగల్ పార్లమెంట్ సీటును మహిళకు కేటాయించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ కోరారు. పట్టణంలోని అమరధామంలో జరిగిన తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే మహిళా బిల్లు ప్రవేశపెట్టినప్పటికీ మిగతా పార్టీలు ఆమోదం తెలుపలేదని, నేడు బీజేపీ ప్రభుత్వం హయాంలో సాధ్యమైనందున రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని సీనియర్ నాయకురాలు కూరాకుల భారతికి కేటాయించాలని కోరారు. మాజీ లేబర్ కమిషనర్‌గా, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. రవి, శేఖర్, పద్మ, సుగుణ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్ చక్రధర్

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ రాచర్ల ప్రభాకర్ భార్య సంధ్య రైలు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆమె భారతీయ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాయంపేట శాఖలో పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ పొంది ఉంది. ఈ మేరకు రూ.20 లక్షలు క్లైమ్ కాగా ఆ చెక్కును బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ చక్రధర్ సంధ్య కూతురుకి అందించారు. ఎస్‌బీఐ ఖాతా కలిగిన ప్రతిఒక్కరూ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ మినిమం 100 రూపాయలు నుంచి 1000 రూపాయలు బీమా ప్రీమియం చెల్లిస్తే ప్రమాదవశాత్తు ఖాతాదారుడు మృతి చెందితే రూ.100 పాలసీకి రెండు లక్షలు, రూ.1000 పాలసీకి 20లక్షలు క్లైమ్ లభిస్తుందని మేనేజర్ తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు ఇన్సూరెన్స్ చేసుకుని కుటుంబానికి భరోసా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్యాష్ ఆఫీసర్ కిశోర్, క్యాషియర్‌లు ప్రణయ్, మనోజ్‌కుమార్, ఎఫ్ఓఎస్ అక్బర్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీ’లకు దరఖాస్తు చేసుకోవాలి


కమలాపూర్ : మాట్లాడుతున్న తహసీల్దార్


పరకాల : దరఖాస్తులు స్వీకరిస్తున్న అనిత


ధర్మసాగర్ : మాట్లాడుతున్న తహసీల్దార్

- భారీగా తరలొచ్చిన ప్రజలు
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు
- కొన్ని చోట్ల లబ్ధిదారుల అయోమయం
- మూడోరోజు కొనసాగిన ‘ప్రజాపాలన’


ఎల్కతుర్తి : దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్


ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి


ఐనవోలు : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఎల్కతుర్తి: రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలు తమకు కావాల్సిన పథకాల అమలుకు దరఖాస్తు చేసుకోవాలని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి తహసీల్దార్లు జగత్‌సింగ్, వెంకటభాస్కర్ అన్నారు. శనివారం ఎల్కతుర్తి మండలంలోని దామెర–985, కేశవాపూర్–851 దరఖాస్తులను స్వీకరించారు. అలాగే భీమదేవరపల్లి మండలం రసూల్‌పల్లి, మల్లారం, గాంధీనగర్, మాణిక్యాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్ల వద్ద ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్, ఏపీఎం రవీందర్, ఏపీఓ అనిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, ఏఈ లక్ష్మణ్‌నాయక్, ఏఈఓ రాజుతో పాటు పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: ఐదు గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమకు అవసరమైన పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మాధవి, ఎంపీడీఓ గుండె బాబు కోరారు. కమలాపూర్, ఉప్పల్, ఉప్పలపల్లి గ్రామాల్లో శనివారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు తదితర ఐదు పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి దరఖాస్తులు అందించారు. మూడో రోజు మూడు గ్రామాల్లో కలిపి మొత్తం 3,810 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, పలు శాఖల అధికారులు, సర్పంచులు కట్కూరి విజయతిరుపతిరెడ్డి, ఎర్రబెల్లి దేవేందర్‌రావు, బొల్లపెల్లి ఉమారవీందర్, వైస్ ఎంపీపీ మౌటం శైలజఅశోక్, ఎంపీటీసీలు మాట్ల వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్, ఐనవోలు గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం కొనసాగింది. గ్రామసభల్లో ముఖ్య అతిథిగా ఎంపీపీ మధుమతి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటాపూర్‌లో 882, ఇతర సమస్యలపై 88, ఐనవోలులో 702, ఇతర సమస్యలపై 60 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాగా మండల వ్యాప్తంగా శనివారం ప్రజాపాలన దరఖాస్తులు 2,987, ఇతర సమస్యలపై వచ్చిన 289 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల్లో ప్రజాపాలన దరఖాస్తులు 4,515, ఇతర సమస్యలపై అప్లికేషన్‌లు 421 స్వీకరించినట్లు తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఆదివారం, సోమవారం సెలవుల కారణంగా దరఖాస్తులు స్వీకరించబడవని, తిరిగి మంగళవారం నుంచి స్వీకరిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డీసీఓ నాగేశ్వర్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలో ప్రజాపాలన కార్యక్రమం శనివారం కొనసాగింది. రాయపర్తిలో పరకాల నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రామ్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్. వెంకటనారాయణ కౌంటర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గుండాల నాగరాజు, ఎంపీఓ సయ్యద్ అఫ్జల్, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండల కేంద్రంతో పాటు ఊరుగొండలో శనివారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించాలని వెల్లడించారు. సమావేశంలో సర్పంచ్‌లు గోగుల సత్యనారాయణరెడ్డి, గురిజాల శ్రీరాంరెడ్డి, మండల ప్రత్యేక అధికారి మాధవీలత, ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, జాకిర్‌అలీ, ఉపసర్పంచ్‌లు హింగె నాగేశ్వర్‌రావు, జన్ను విద్యాసాగర్, ఏపీఎం ఝాన్సీ, ఏపీఓ శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ప్రజాపాలనలో శనివారం వరకు మండలంలో 3,185 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలో ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ శనివారం కొనసాగింది. మండల కేంద్రంలో జరిగిన సభలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వతగిరి రాజు, ఎంపీటీసీ బయ్య రమరాజు, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఐకేపీ ఏపీఎం లలిత, ఎస్సై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : ప్రజాపాలనలో ప్రతి లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకోవాలని, రేషన్‌కార్డు లేకున్నా దరఖాస్తులు సమర్పించవచ్చని తహసీల్దార్ సదానందం తెలిపారు. మండలంలోని క్యాతంపల్లి, జానకిపురం, ముప్పారం గ్రామాల్లో శనివారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వివాహం అయిన ప్రతి వ్యక్తి దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్‌బిల్లు, విద్యుత్ బిల్లు, ఉపాధిహామీ జాబ్ కార్డు జిరాక్స్‌లు జత చేయాలని సూచించారు. కుల ప్రాతిపదికన దరఖాస్తులు తీసుకోవడం లేదని, దీనికి ఆదాయం, నివాసం, క్యాస్ట్ సర్టిఫికెట్‌లు అవసరం లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసర లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : ఆరు గ్యారంటీల పథకాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, కమిషనర్ శేషాంజన్‌స్వామి అన్నారు. మండలంలోని పోచారం, వెల్లంపల్లి, కామారెడ్డిపల్లి, అలియాబాద్, మల్లక్‌పేట, నాగారం, లక్ష్మీపూర్, వెంకటాపూర్, హైబోతుపల్లి, పైడిపల్లి గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని మూడోరోజు నిర్వహించారు. రెండు రోజుల సెలవుల అనంతరం జనవరి 2 నుంచి 6వరకు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులదారులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, టీపీఓ రాజు, మున్సిపల్ ఏఈ వంశీకృష్ణ, ఏఈఓ శైలజ, విద్యుత్ అధికారులు, ఆశ వర్కర్స్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దామెర: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల ఎస్సీ కాలనీలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 60 సంవత్సరాలపైబడిన వయోవృద్ధుల కోసం సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతినెలా పరీక్షలు చేసుకొని వైద్యుల సూచనలు పాటించాలని అన్నారు. వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, డాక్టర్లు మదన్‌మోహన్, మహమ్మద్ తాహెర్ మసూద్, పెసరు నితీష్‌చందర్‌రెడ్డి, సిబ్బంది శివకుమార్, శ్రీకాంత్, సాగర్, అనిల్, నరసింహచారి, పోశాలు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాతో కుటుంబానికి ధీమా

శాయంపేట : పోస్టల్ శాఖ ద్వారా అందించే బీమాను పొంది కుటుంబానికి ధీమాగా నిలవాలని పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరిండెంట్ అనంతరామ్ అన్నారు. పోస్టాఫీస్‌కు వచ్చిన ఖాతాదారులతో శనివారం ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మృతి చెందితే ఆ కుటుంబానికి తీరనిలోటు జరుగుతుందన్నారు. ప్రమాదబీమా పాలసీలను పొంది ఉన్నట్లైతే ఆ కుటుంబానికి ఆర్థిక అండ లభిస్తుందన్నారు. గతంలో 10లక్షల వరకే ప్రమాదబీమా ఉండేదని అన్నారు. కానీ ప్రస్తుతం రూ.755 చెల్లిస్తే 15 లక్షల బీమా సౌకర్యం ఉందన్నారు. ఖాతాదారులకు పోస్టాఫీస్ ద్వారా అందిస్తున్న వివిధ పథకాలను, పాలసీలను వివరించారు. తపాల శాఖ అందించే పథకాలను సిబ్బంది విరివిగా ప్రచారం చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ జీవన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూరా శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర


గుడెప్పాడ్‌లో శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర చేపట్టిన భక్తులు


పెంచికలపేటలో అక్షింతల ర్యాలీ

ఆత్మకూరు : మండలంలో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర శనివారం వైభవంగా జరిగింది. పెంచికలపేట, గుడెప్పాడ్‌లో స్వామివారి అక్షింతలను పల్లకిలో ఊరేగించారు. అర్చకులు కేశవమూర్తి, సత్యనారాయణ, సహసంయోజక్ నాగబండి శివప్రసాద్, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, జనగాం సాంబయ్య, సముద్రాల రవి, ఓదెల చంద్రమౌళి పాల్గొన్నారు.

గడీల పాలన నుంచి తెలంగాణకు విముక్తి


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

వేలేరు : గడీల పాలన నుంచి తెలంగాణ రాష్ట్రానికి విముక్తి లభించిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర అన్నారు. పలు గ్రామాల్లో కొనసాగుతున్న ప్రజాపాలనను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని విమర్శించారు. అనంతరం మల్లికుదుర్ల బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నార్లగిరి ప్రవీణ్, నాయకులు ఆపార్టీకి రాజీనామా చేసి ఇందిర సమక్షంలో పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు సంపత్, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సంపత్, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, లక్ష్మణ్ నాయక్, మధుసూదన్, సలీం మాలీక్ పాల్గొన్నారు.

అయోమయంలో లబ్ధిదారులు

నడికూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో కొందరు లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. దరఖాస్తుతో జతపరుచాల్సిన జిరాక్స్ కాపీల విషయంలో స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు జతపరచాల్సి ఉంటే కౌంటర్ల వద్ద మాత్రం గ్యాస్‌బుక్కు జిరాక్స్, కరెంట్ బిల్ జిరాక్స్ అడుగుతుండడంతో లబ్ధిదారులు జిరాక్స్ సెంటర్ల వద్ద బారులుదీరుతున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు జిరాక్స్ సెంటర్ నిర్వాహకులు ఒక్కో జిరాక్స్ కాపీకి రూ.5నుంచి రూ.10 దండుకుంటున్నారు. రేషన్‌కార్డు దరఖాస్తు ఫార్మాట్‌కు రూ.40 వరకు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు కనీసం వంద రూపాయల వరకు ఖర్చు అవుతోందని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.